క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

భువనగిరి: పట్టణంలో చెట్ల కొమ్మలు తొలగిస్తున్నందున సోమవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ పట్టణ ఏఈ సాయికృష్ణ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక పాత బస్టాండ్ నుంచి ఎస్ఎల్ఎన్ఎస్ డిగ్రీ కళాశాల వరకు సంతోష్‌నగర్, శృతినగర్, పెంటాజీనగర్, ఎస్ఎల్ఎన్ఎస్ డిగ్రీ కళాశాల హన్మాన్‌వాడ వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు పేర్కొన్నారు.

ఉచిత శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

అడ్డగూడూరు: ప్రభుత్వ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల్లో 2020 నుంచి 2024 వరకు ఇంటర్మీడియట్ చదివి 18నుంచి 25 సంవత్సరాల మధ్య వయసు కలిగిన విద్యార్థులు 30 రోజులు ఉచిత వృత్తి నైపుణ్య శిక్షణకు దరఖాస్తు చేసుకోవాలని స్థానిక గురుకుల బాలికల పాఠశాల, కళాశాల ప్రిన్సిపాల్ విజిన చౌదరి ఆదివారం తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు ఈనెల 20 తేదీలోపు స్థానిక కళాశాలలో సంప్రదించాలని కోరారు.

తిరంగా ర్యాలీని విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న పన్నాల చంద్రశేఖర్‌రెడ్డి

ఆత్మకూరు(ఎం): జిల్లా కేంద్రంలో ఈ నెల 20న నిర్వహించనున్న తిరంగా ర్యాలీని విజయవంతం చేయాలని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు పన్నాల చంద్రశేఖరరెడ్డి కోరారు. ఆపరేషన్ సింధూర్ విజయం నేపథ్యంలో ఆదివారం ఆత్మకూరు మండల కేంద్రంలో నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. నేషనల్ ఫర్ సిటిజన్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 20న సాయంత్రం 4 గంటలకు జిల్లా కేంద్రంలో తిరంగా ర్యాలీ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. సమావేశంలో బీజేపీ మండల అధ్యక్షుడు గజరాజు కాశీనాథ్, యువమోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి దయ్యాల కుమారస్వామి, నాయకులు లోడి వెంకటయ్య, గజెల్లి మధు పాల్గొన్నారు.

పెహల్గాం ఘటనను ముస్లిం సమాజం ఖండిస్తోంది



ప్రసంగిస్తున్న ప్రముఖ వక్త అబ్దుల్ రెహమాన్

భువనగిరిటౌన్ : కశ్మీర్‌లోని పెహల్గాంలో జరిగిన ఉగ్రదాడిని యావత్ ముస్లిం సమాజం తీవ్రంగా ఖండిస్తోందని ప్రముఖ వక్త అబ్దుల్ రెహమాన్ అన్నారు. ఆదివారం భువనగిరి పట్టణంలోని మస్జిద్ ఏ తౌహిద్‌లో నిర్వహించిన జల్సా కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పలువురు వక్తలు ఖలీలుల్లా ఫైజీ, మీర్ మోతీషాఅలీఖాన్ పాల్గొన్నారు.

ధాన్యం ఎగుమతిలో జాప్యం



మాట్లాడుతున్న గోద శ్రీరాములు

భువనగిరిటౌన్ : కొనుగోలు కేంద్రాల్లో కాంటా వేసిన ధాన్యాన్ని తరలించడంలో జాప్యం జరుగుతోందని, తక్షణమే సమస్య పరిష్కరించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి గోద శ్రీరాములు డిమాండ్ చేశారు. ఆదివారం భువనగిరిలోని సీపీఐ కార్యాలయంలో నిర్వహించిన పార్టీ మహాసభలో ఆయన మాట్లాడారు. కొనుగోలు కేంద్రాల్లో ఇంకా వేల క్వింటాళ్ల ధాన్యం నిల్వ ఉందన్నారు. సమావేశంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు ఏశాల అశోక్, ఉడుత రాఘవులు, చింతల పెంటయ్య, చొప్పరి సత్తయ్య, దాసరి లక్ష్మయ్య, రమేష్ పాల్గొన్నారు.

22న హనుమాన్ జయంతి ఉత్సవాలు

వలిగొండ : ఈ నెల 22న హనుమాన్ జయంతి సందర్భంగా వలిగొండ మండలంలోని వెంకటాపురంలో గల శ్రీ మత్స్యగిరి లక్ష్మీనర్సింహ స్వామి ఆలయ ప్రాంగణంలో ఆంజనేయ స్వామికి పల్లకి సేవ, అష్టోత్తరం, సింధూరార్చన నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ కొమ్మారెడ్డి నరేష్ రెడ్డి, ఆలయ కార్య నిర్వహణ అధికారి మోహన్ బాబు ఆదివారం తెలిపారు. భక్తులకు అన్నదానం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

ప్రయాణం పాట్లు



ఆత్మకూరు(ఎం) స్టేజీ వద్ద నిల్చున్న ప్రయాణికులు

- ప్రధాన స్టేజీల వద్ద వసతులు కరువు
- ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు

ఆత్మకూరు(ఎం): ప్రధాన స్టేజీల వద్ద బస్‌షెల్టర్లు లేక, తాగునీరు లేక ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. ఆత్మకూరు(ఎం) మండలంలోని రాయిపల్లి, తిమ్మాపురం క్రాస్‌రోడ్డు, ఆత్మకూరు(ఎం), తుక్కాపురం, పోసానికుంట, రహీంఖాన్‌పేట, కప్రాయపల్లిలో ప్రధాన స్టేజీలు ఉన్నాయి. ఈస్టేజీల నుంచి ఉదయం నుంచి సాయంత్రం వరకు అటు మోత్కూరు వైపు, ఇటు భువనగిరి వైపు సుమారు 1500ల మంది వరకు ప్రయాణం సాగిస్తుంటారు. మోత్కూరు నుంచి ఆత్మకూరు(ఎం)మీదుగా భువనగిరి, హైదరాబాద్‌కు తొర్రూరు, జనగాం, యాదగిరిగుట్ట, హైదరాబాద్–2, మహబూబాద్, సూర్యాపేట, నర్సంపేట, ఉప్పల్‌లకు చెందిన ఆర్టీసీ బస్సులు 80 ట్రిప్పుల వరకు నడుస్తున్నాయి. అయితే ప్రధాన స్టేజీల వద్ద ఆర్టీసీ అధికారులు ఎటువంటి వసతులు కల్పించకపోవడంతో గంటల తరబడి నిల్చొని ప్రయాణం చేస్తున్నారు. దాహం తీర్చుకోవడానికి తాగునీరు కూడా కొనుక్కోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఆత్మకూరు(ఎం) స్టేజీ వద్ద టాయిలెట్లు లేక మహిళా ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. ఆర్టీసీ అధికారులు స్పందించి ప్రధాన స్టేజీల వద్ద ప్రయాణికులకు వసతులను కల్పించాలని కోరుతున్నారు.

గంటల తరబడి నిల్చోవాల్సి వస్తోంది



మాది పల్లెర్ల గ్రామం. భువనగిరికి, మోత్కూరుకు పోవాలంటే ఆత్మకూరు(ఎం) నుంచి పోవాల్సిందే. ఆత్మకూరు(ఎం) స్టేజీ వద్ద ప్రయాణికులకు ఎలాంటి వసతులు లేవు. గంటల తరబడి నిల్చుంటున్నాం. ప్రయాణికుల సమస్యలను ఆర్టీసీ అధికారులు పట్టించుకోవడం లేదు.

– గుర్రం రాజమణి, పల్లెర్ల

వసతులు కల్పించాలి



రాయిగిరి నుంచి మోత్కూరు వరకు ప్రధాన స్టేజీల వద్ద ప్రయాణికులకు ఎలాంటి వసతులు లేవు. దీంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రతి స్టేజీ వద్ద మంచినీరు, బస్‌షెల్టర్ సౌకర్యం కల్పించాలి. రాయిగిరి నుంచి మోత్కూరు వరకు స్టేజీల వద్ద చిరువ్యాపారులు ఆక్రమించుకుని వ్యాపారాలు నిర్వహిస్తుండడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు.

– ఎద్దు వెంకటేశ్వర్లు, ఆత్మకూరు(ఎం)



భువనగిరి బస్టాండ్‌లో బస్సుల కోసం వేచి చూస్తున్న ప్రయాణికులు

బస్సుల కోసం నిరీక్షణ

భువనగిరిటౌన్ : జిల్లా కేంద్రానికి వచ్చే ప్రజలకు పట్నం పోవాలంటే బస్సుల కోసం నిరీక్షణ తప్పడం లేదు. ఆదివారం కావడంతో యాదగిరిగుట్ట, స్వర్ణగిరి దేవాలయాలకు వచ్చిన ప్రజలు రాత్రి వరకు బస్సుల కోసం భువనగిరి బస్టాండ్‌లో వేచి చూశారు. భువనగిరి నుంచి ఉప్పల్ వరకు షటల్ బస్సులు వేసినా కొన్ని రోజులు మాత్రమే నడుస్తున్నాయి. మరికొన్ని వస్తున్నప్పటికీ సమయ పాలన పాటించడం లేదు.

దుర్గామాత మందిరంలో ఎమ్మెల్యే పూజలు

వలిగొండ : మండలంలోని ఎం.తుర్కపల్లిలో ఇటీవల నూతనంగా నిర్మించిన శ్రీ కనక దుర్గా మాత మందిరంలో గ్రామ దేవతల ఉత్సవాల సందర్భంగా ఆదివారం ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి ప్రత్యేక పూజలు చేశారు. ఆయనను స్థానిక నాయకులు పూలమాలలతో శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో భీమా నాయక్, కొమ్మారెడ్డి నరేష్ రెడ్డి, నూతి రమేష్, తుమ్మల యుగంధర్ రెడ్డి, బొల్ల శ్రీనివాస్, బాతరాజు బాల్ నర్సింహ, బద్దం సంజీవ రెడ్డి, సతీష్, సత్తిరెడ్డి, ఎల్లయ్య పాల్గొన్నారు.



దుర్గామాత మందిరంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే అనిల్ కుమార్ రెడ్డి

ధాన్యం బస్తాలు రైస్ మిల్లులకు తరలించాలి

బీబీనగర్: కొనుగోలు కేంద్రాల్లో కాంటా వేసిన ధాన్యం బస్తాలను వెంటనే రైస్ మిల్లులకు తరలించాలని ఆర్డీఓ కృష్ణారెడ్డి అన్నారు. బీబీనగర్ మండలంలోని చిన్నరావులపల్లి, భట్టుగూడెం గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను, కాదంబరి రైస్‌మిల్లులోని ధాన్యం బస్తాల దిగుమతిని పరిశీలించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ... కేంద్రాల్లో ధాన్యం కాంటా వేయగానే లారీల్లో మిల్లులకు తరలించాలని, వర్షాలు పడుతున్నందున ధాన్యం తడవకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఆయన వెంట ఆర్ఐ వెంకటరెడ్డి ఉన్నారు.



ధాన్యం బస్తాల దిగుమతిని పరిశీలిస్తున్న ఆర్డీఓ

మార్కెట్ యార్డులో రైతుబజార్ ఏర్పాటు చేయిస్తాం



మాట్లాడుతున్న మార్కెట్ చైర్మన్ వెంకటయ్య

చౌటుప్పల్ : వ్యవసాయ మార్కెట్ యార్డులో రైతు బజార్ ఏర్పాటు చేయిస్తామని వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ఉబ్బు వెంకటయ్య తెలిపారు. ఆదివారం మార్కెట్ కార్యాలయంలో నిర్వహించిన పాలకవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి సహకారంతో రైతు శ్రేయస్సే ధ్యేయంగా ముందుకు సాగుతామన్నారు. పత్తి కొనుగోలు కేంద్రాన్ని కూడా ఏర్పాటు చేయిస్తామన్నారు. మార్కెట్‌లో 40వేల లీటర్ల సామర్థ్యం కలిగిన వాటర్ ట్యాంకును నిర్మించాల్సి ఉందని తెలిపారు. ఈ మేరకు కమిటీ సభ్యులు ఆయా అంశాలపై ఏకగ్రీవంగా తీర్మానం చేశారు. సమావేశంలో వైస్ చైర్మన్ ఆకుల ఇంద్రసేనారెడ్డి, సెక్రటరీ రవీందర్‌రెడ్డి, వ్యవసాయాధికారి ముత్యాల నాగరాజు, డైరెక్టర్లు రఘుమారెడ్డి, వెంకటేష్, శంకర్‌నాయక్, చంద్రకళ, సప్పిడి సంజీవరెడ్డి, నవీన్, గౌస్‌ఖాన్, వెంకట్‌రెడ్డి, పబ్బు శ్రీకాంత్, రాజిరెడ్డి, వెంకటేష్, విజయ్‌కుమార్, కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

షాడో ఎమ్మెల్యేలుగా వ్యవహరిస్తున్న స్థానిక నాయకులు

చౌటుప్పల్ : ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాలరెడ్డి వెంట ఉండే స్థానిక నాయకులు షాడో ఎమ్మెల్యేలుగా వ్యవహరిస్తున్నారని సింగిల్‌విండో చైర్మన్ చింతల దామోదర్‌రెడ్డి, బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు గిర్కటి నిరంజన్‌గౌడ్, మాజీ జెడ్పీటీసీ పెద్దిటి బుచ్చిరెడ్డి ఆరోపించారు. చౌటుప్పల్ పట్టణ కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. షాడో ఎమ్మెల్యేలుగా వ్యవహరిస్తూ అనేక అక్రమాలకు పాల్పడుతున్నారన్నారు. అసైన్డ్ భూములను ప్లాట్లుగా మార్చారని విమర్శించారు. కాంగ్రెస్ నాయకులు ఇప్పటికైనా నోరు అదుపులో పెట్టుకోకుంటే గుణపాఠం తప్పదన్నారు. సమావేశంలో మార్కెట్ మాజీ చైర్మన్ బొడ్డు శ్రీనివాస్‌రెడ్డి, బీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు డిల్లీ మాధవరెడ్డి, నాయకులు కొత్త పర్వతాలు, అల్మాసిపేట కిష్టయ్య, ఊడుగు మల్లేష్, గుండెబోయిన వెంకటేశం, తాడూరి పరమేష్, తొర్పునూరి నర్సింహ, చౌట బాలరాజు, గంజి విజయ్‌కుమార్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బీఆర్ఎస్ పార్టీ నాయకులు

దళితులు సేద్యం చేసుకుంటున్న భూములకు పట్టాలు ఇవ్వాలి

భువనగిరి: మండలంలోని హన్మాపురం గ్రామంలో సర్వే నంబర్ 87లో దళితులు సేద్యం చేసుకుంటున్న భూములకు పట్టాలు ఇవ్వాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కొండమడుగు నర్సింహ అన్నారు. ఆదివారం హన్మాపురం గ్రామంలో సర్వే నంబర్ 87లో దళితులు సేద్యం చేసుకుంటున్న భూములను తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం మండల కమిటీ ఆధ్వర్యంలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత 70 సంవత్సరాల నుంచి సేద్యం చేసుకుంటున్న భూములకు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నా పట్టాలు ఇవ్వలేదన్నారు. ఆయన వెంట జీఎంపీఎస్ జిల్లా నాయకులు దయ్యాల నర్సింహ, తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం మండల ప్రధాన కార్యదర్శి పల్లెర్ల అంజయ్య, మాడుగుల రాజు, నర్సింహ, ఉప్పలయ్య, భిక్షపతి, జహంగీర్, పరమేష్, ప్రభాకర్, మహేష్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కొండమడుగు నర్సింహ

కొణతం బక్కారెడ్డికి నివాళి



బక్కారెడ్డికి నివాళులర్పిస్తున్న నాయకులు

మోత్కూరు : మోత్కూరు పట్టణంలో ఆదివారం సీపీఐ ఆధ్వర్యంలో కొణతం బక్కారెడ్డి వర్ధంతి నిర్వహించారు. స్థానిక కేఆర్ భవనం ఎదుట ఉన్న బక్కారెడ్డి స్తూపం వద్ద సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి యానాల దామోదర్‌రెడ్డి నివాళులర్పించారు. చేనేత కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి పాశికంటి లక్ష్మీనర్సయ్య జెండా ఎగుర వేశారు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి అన్నెపు వెంకట్, గీత పనివారల సంఘం జిల్లా అధ్యక్షుడు చాపల అంజయ్య, ప్రజా నాట్య మండలి జిల్లా అధ్యక్షుడు బుషిపాక నర్సింహ, నాయకులు తొండ తిరుపతయ్య, దొండ రామయ్య, మొగుళ్ల శేఖర్‌రెడ్డి, ఎండీ అబ్బాస్ అలీ, జిట్ట రాములు, కడమంచి వీరస్వామి, ఎండీ పాషా, దొండ రాములు, తాడూరు లక్ష్మీ నర్సయ్య పాల్గొన్నారు.

ఆదర్శంగా నిలిచిన సిరిపురం గ్రామస్తులు

రామన్నపేట: ఆపదలో ఉన్న కుటుంబానికి ఆర్థిక సాయం చేసి ఆదర్శంగా నిలిచారు సిరిపురం గ్రామస్తులు. గ్రామానికి చెందిన తుంగ గోవర్ధన్ పదిరోజుల క్రితం జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. సోషల్‌మీడియా వేదికగా పెట్టిన పోస్టుకు స్పందించిన పలువురు ఫోన్‌పే ద్వారా డబ్బులు పంపించారు. ఈమేరకు వచ్చిన రూ 1,73,300లను ఆదివారం బాధిత కుటుంబానికి అందజేశారు. కార్యక్రమంలో పున్న జగన్మోహన్, రాపోలు నర్సింహ, అప్పం రామేశ్వరం, పున్న వెంకటేశం, రాపోలు రమేష్, సుక్క శ్రవన్‌కుమార్, గంజి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత



ఆర్థికసాయం అందజేస్తున్న వెంకట్ రెడ్డి

వలిగొండ : మండలంలోని సుంకిశాలకు చెందిన ఈతాప కామరతి ఇటీవల అనారోగ్యానికి గురై మృతిచెందారు. బాధిత కుటుంబానికి అదే గ్రామానికి చెందిన పైళ్ల వెంకట్ రెడ్డి శాలిని దంపతులు రూ.10వేల ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో పైళ్ల రాజవర్ధన్ రెడ్డి, తుమ్మల సత్యనారాయణ రెడ్డి, మంచోజు పరిపూర్ణాచారి, ఈతాప రాములు, ఈతాప మల్లేశం, కొండె కృష్ణయ్య, మొగిలిపాక నర్సింహ, జహంగీర్, పైళ్ల మోహన్ రెడ్డి, కొమ్ముగాని లక్ష్మయ్య పాల్గొన్నారు.

రామన్నపేట: మండల కేంద్రంలో శనివారం రాత్రి మిర్యాల కళమ్మ మృతిచెందింది. బాధిత కుటుంబానికి గరికె ఫౌండేషన్ వ్యవస్థాపకుడు గరికె సత్యనారాయణ ఆదివారం రూ.10వేల ఆర్థికసాయాన్ని అందజేశారు. అనంతరం కళమ్మ మృతదేహానికి నివాళులర్పించారు.

కొనుగోలు కేంద్రం పరిశీలన

తుర్కపల్లి: కొనుగోలు చేసిన ధాన్యాన్ని ట్యాగ్ చేసిన మిల్లులకు రవాణా చేయాలని తహసీల్దార్ దేశ్యా నాయక్ నిర్వాహకులకు సూచించారు. ఆదివారం తుర్కపల్లి మండల కేంద్రంతో పాటు ముల్కలపల్లిలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన తనిఖీ చేసి రికార్డులు పరిశీలించారు. రాంపూర్‌తండా గోడౌన్ లో దిగుమతికి సిద్ధంగా ఉన్న 23 లారీలను త్వరగా దింపి కేంద్రాలకు పంపించాలని ఆదేశించారు.

స్థానిక సమస్యల పరిష్కారానికి పోరాడాలి

రామన్నపేట: స్థానిక సమస్యల పరిష్కారానికి పార్టీ శ్రేణులు పోరాడాలని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి యానాల దామోదర్‌రెడ్డి అన్నారు. ఆదివారం రామన్నపేట మండల కేంద్రంలో నిర్వహించిన పార్టీ మండల కౌన్సిల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈనెల చివరి వరకు గ్రామశాఖల మహాసభలు నిర్వహించాలన్నారు. సమావేశంలో మండల కార్యదర్శి ఊట్కూరి నర్సింహ సహాయ కార్యదర్శి ఎర్ర రమేష్, సభ్యులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ గౌస్‌కొండ గ్రామ కమిటీ ఎన్నిక

భూదాన్‌పోచంపల్లి: భూదాన్‌పోచంపల్లి మండలంలోని గౌస్‌కొండ కాంగ్రెస్ పార్టీ గ్రామశాఖ నూతన కమిటీని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా మర్రి పాండురెడ్డి, ఉపాధ్యక్షుడిగా వంగూరి రవి, ప్రధాన కార్యదర్శిగా కాసుల గోవర్ధన్, కోశాధికారిగా మద్ది రహణ్యారెడ్డి, సహాయకార్యదర్శిగా కందుకూరు నాగరాజుతోపాటు కార్యవర్గ సభ్యులు ఎన్నికయ్యారు.

మండలాభివృద్ధికి సహకరించాలి

- ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య

మోటకొండూర్: మోటకొండూర్ మండల అభివృద్ధికి అఖిలపక్ష నాయకులు, ప్రజలు సహకరించాలని ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య కోరారు. ఆదివారం మోటకొండూర్ మండల కేంద్రంలోని రైతు వేదిక వద్ద అఖిలపక్ష నాయకులతో నిర్వహించిన సమావేశంలో మండలాభివృద్ధిపై చర్చించారు. ప్రభుత్వ పక్కా భవనాల నిర్మాణానికి స్థల సేకరణ కోసం అన్ని పార్టీల నాయకులు సహకరించాలన్నారు. అంతకు ముందు మండల కేంద్రంలో తాగునీటి వాటర్ ప్లాంట్‌ను ప్రారంభించారు. అనంతరం చామాపూర్ గ్రామంలో నిర్వహించిన మాతమ్మ వేడుకలకు హాజరయ్యారు. కార్యక్రమంలో మదర్ డెయిరీ చైర్మన్ మధుసూదన్‌రెడ్డి, సంజీవరెడ్డి, తహసీల్దార్ నాగదివ్య, ఎంపీడీఓ ఇందిర, కంకల ఎలేందర్, భాస్కరుణి రఘునాథరాజు, తండ రంగయ్యగౌడ్, బాల్ద రామకృష్ణ, భూమండ్ల శ్రీనివాస్, వంగాల మల్లేష్, భూమండ్ల అశోక్, బుగ్గ కొమురయ్య, బుగ్గ మహేష్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య

నిలిచిన రోడ్డు విస్తరణ పనులు



మట్టి పోసి వదిలేసిన రోడ్డు

- అసంపూర్తిగా రాజన్నగూడెం–మోత్కూరు రోడ్డు
- మూడు కిలో మీటర్ల రోడ్డుకు కిలో మీటరు వరకు బీటీ వేసి వదిలేశారు

మోత్కూరు : మోత్కూరు మున్సిపాలిటీ పరిధిలో రోడ్డు విస్తరణ పనులు నిలిచిపోయాయి. మోత్కూరు మున్సిపల్ కేంద్రంలోని పాల శీతలీకరణ కేంద్రం చౌరస్తా (పనకబండ) నుంచి రాజన్నగూడెం వరకు 3.6కిలోమీటర్ల మేర రోడ్డు విస్తరణ, పునర్నిర్మాణ పనుల నిమిత్తం 2021–22లో అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం రూ.5.80 కోట్లు మంజూరు చేసింది. పనులు చేపట్టేందుకు సీ5 కన్‌స్ట్రక్షన్ కంపెనీ టెండర్ దక్కించుకుంది. వివిధ కారణాలతో సదరు కాంట్రాక్టర్ రోడ్డు నిర్మాణ పనులు చేపట్టలేదు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మోత్కూరు–రాజన్నగూడెం గ్రామాల మధ్య రోడ్డు విస్తరణ పనులకు 2024న జనవరి 24న మున్సిపల్ కేంద్రంలోని పనకబండ చౌరస్తా వద్ద ఎమ్మెల్యే మందుల సామేల్ శంకుస్థాపన చేశారు. 7 మీటర్ల వెడల్పు నుంచి 10 మీటర్ల వెడల్పుతో రోడ్డు విస్తరణ చేసి మట్టి రోడ్డు పనులు పూర్తి చేశారు. బీఎస్ఎన్ఎల్ ఎక్సేంజ్, రాజన్నగూడెం వద్ద కాంక్రీట్ కల్వర్టు పనులు పూర్తి చేశారు. రాజన్నగూడెం స్టేజీ నుంచి కిలో మీటరు ఓ వైపు బీటీ రోడ్డు వేసి మరో వైపు కంకర పరిచి మట్టితో రోలింగ్ చేయించారు. అయితే మూడు నెలలుగా కాంట్రాక్టర్ పనులు నిలిపి వేశాడు. తిరిగి అధికారుల ఒత్తిడితో కిలో మీటరు దూరం బీటీ రోడ్డు పనులు చేసి పూర్తి చేశాడు. రాజన్నగూడెం పెట్రోల్ బంక్ నుంచి పనకబండ చౌరస్తా వరకు రెండు కిలో మీటర్ల మేర బీటీ వేయాల్సి ఉంది. అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి రోడ్డు పనులు పూర్తి చేయించాలని ప్రయాణికులు కోరుతున్నారు.

అవస్థలు పడుతున్నాం



రోడ్డు విస్తరణ పనులు త్వరగా పూర్తి చేయకపోవడంతో అవస్థలు పడుతున్నాం. ఏడాదిన్నర కాలంగా అసంపూర్తి రోడ్డు పనులతో ఇక్కట్లు ఎదుర్కొంటున్నాం. ప్రధాన రహదారి విస్తరణ రోడ్డు పనులపై అలసత్వం వహించే కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలి.

– పోచం సోమయ్య, మోత్కూరు

కాంట్రాక్టర్‌కు నోటీసులు ఇచ్చాం

సదరు సీ5 కన్‌స్ట్రక్షన్ కంపెనీ కాంట్రాక్టర్‌కు అధికారులు నోటీసులు ఇచ్చారు. అగ్రిమెంట్ పీరియడ్ పూర్తయింది. టెండర్ రద్దు చేసి కొత్త కాంట్రాక్టర్‌కు అప్పగించి అగ్రిమెంట్‌పై అధికారులు సంతకాలు చేస్తారు.

– మెంట స్వామి, ఏఈఈ, ఆర్అండ్‌బీ శాఖ, మోత్కూరు

ప్రజాపాలనలో ప్రజలందరికీ సంక్షేమ ఫలాలు

భూదాన్‌పోచంపల్లి: కాంగ్రెస్ ప్రజాపాలనలో ప్రజలందరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయని ఆ పార్టీ మండల అధ్యక్షుడు పాక మల్లేశ్‌యాదవ్ అన్నారు. ఆదివారం భూదాన్‌పోచంపల్లి మండలంలోని జలాల్‌పురంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మండలానికి సీసీరోడ్లు, డ్రెయినేజీ నిర్మాణాలకు రూ. 2కోట్లు, హెచ్ఎండీఏ కింద రూ.9 కోట్లు మంజూరయ్యాయని తెలిపారు. దిగువ ఉన్న రైతులకు సాగునీరందించేందుకు పిలాయిపల్లి కాలువ మరమ్మతు పనులు ప్రారంభమయ్యాయని పేర్కొన్నారు. సమావేశంలో నాయకులు గోరంటి శ్రీనివాస్‌రెడ్డి, మలిపెద్ది అంబరీష్‌రెడ్డి, పడమటి భూపాల్‌రెడ్డి, బోదాసుచిన్న ఈదయ్య, బోదాసు శ్రీను, కుక్క కుమార్, పోతగల్ల శ్రీను, కోట బాలకృష్ణ, తంగెల్ల మల్లేశ్, నవీన్ పాల్గొన్నారు.

అ'పూర్వ' సమ్మేళనం

చౌటుప్పల్ రూరల్ : చౌటుప్పల్ మండలంలోని కుంట్లగూడెం పాఠశాలలో 2005 –06 బ్యాచ్ టెన్త్ విద్యార్థులు ఆదివారం ఒకే వేదికపై కలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు నాటి జ్ఞాపకాలను నెమరువేసుకుని ఉల్లాసంగా గడిపారు. ఉపాధ్యాయులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు తిరుపతిరెడ్డి, శ్రీధర్, నాగభూషణం, నాగయ్య ,విజయలక్ష్మి, నీరజ, పూర్వ విద్యార్థులు మహేష్, గిరిబాబు, గోవర్ధన్, లింగస్వామి, బాల్‌రెడ్డి, నరేష్, కాళిదాస్, సదానందం పాల్గొన్నారు.

ఆలేరు: పట్టణంలో శ్రీరామకృష్ణ విద్యాలయంలో 1999– 2000 బ్యాచ్ టెన్త్ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో శ్రీరామకృష్ణ విద్యాలయం హెచ్ఎం బండిరాజుల శంకర్, ఉపాధ్యాయులు సంజీవులు, దూడల వెంకటేష్, కుమారస్వామి, వెంకటప్రసాద్, మధు, వెంకటేష్, ప్రసాద్, పారిజాత పుష్పం, సుశీల, రమాదేవి, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

వలిగొండ : మండలంలోని వేములకొండ జెడ్పీ ఉన్నత పాఠశాలలో 1988– 89లో పదో తరగతి చదువుకున్న విద్యార్థులు ఆదివారం స్థానిక శ్రీలక్ష్మీనర్సింహ ఫంక్షన్ హాల్‌లో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. కార్యక్రమంలో పూర్వ ఉపాధ్యాయులు అయోధ్య రామయ్య, సత్తయ్య, సోమయ్య, యాదయ్య, ధర్మయ్య, పూర్వ విద్యార్థులు బిట్ల గోవర్ధన్, కొల్లోజు లక్ష్మణ్ బాబు, కొత్త మంజుల, మునుకుంట్ల నర్సింహ, చొల్లేటి రవీంద్ర చారి, కల్కూరు కృష్ణ, జక్క రాంరెడ్డి, జక్క దానమ్మ, శ్రీనివాస్, వెంకటేష్, అంజయ్య చారి, నర్సింహ, మంజుల, విజయలక్ష్మి, నర్సమ్మ తదితరులు పాల్గొన్నారు.



ఆత్మీయ సమ్మేళనంలో కుంట్లగూడెం పాఠశాల పదో తరగతి పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు



ఆలేరు: ఆత్మీయ సమ్మేళనంలో శ్రీరామకృష్ణ విద్యాలయం పూర్వవిద్యార్థులు



వలిగొండ మండలం వేములకొండలో..